క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: 33/22 కేవీ మక్కినవారిగూడెం, టి.నరసాపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు, ట్రీకటింగ్ తదితర పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మక్కినవారిగూడెం, బండివారిగూడెం, సున్నపురాళ్లపల్లి, టి.నరసాపురం టౌన్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టెన్నపాలెంలో గ్రామసభ


గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టెన్నపాలెంలో జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభ సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల వివరాలను ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది వివరించారు. సర్పంచ్ రత్నకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల రాకేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం తహసీల్దార్‌గా రాజు


బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రాజుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం తహసీల్దార్‌గా బీఎస్‌వీఎస్ఆర్ఎల్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి బదిలీపై పోలవరం వచ్చారు. ఈయనకు కార్యాలయం సూపరింటెండెంట్ ఎన్.ప్రసాద్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జీవీఎస్ ప్రసాద్ కాకినాడ బదిలీపై వెళ్లారు.

పశ్చిమ వాసులకు గర్వకారణం ఎల్లాప్రగడ


ఎల్లాప్రగడ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పశ్చిమగోదావరి జిల్లా వాసులకు గర్వకారణంగా నిలిచారని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్లో ఎల్లాప్రగడ 76వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భీమవరానికి చెందిన ఆయన స్ప్రూ వ్యాధికి, మైక్రోసైటిక్ ఎనీమియా వ్యాధులకు ఔషధాలను కనిపెట్టి ఎందరో ప్రాణాలను నిలిపారని తెలిపారు. ఆయన ప్రయోగాలు వైద్య ఆరోగ్య రంగంలోని శాస్త్రవేత్తలకు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అనంతరం సుబ్బారావు చిత్రపటం వద్ద చిన్నారులు నివాళులు అర్పించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ మంత్రి పొంగులేటి పరామర్శ


వెంకాయమ్మను ఓదారుస్తున్న పొంగులేటి

చింతలపూడి: మండలంలోని యర్రంపల్లి గ్రామంలో ఈ నెల 2వ తేదీన డెంగీ జ్వరంతో మృతి చెందిన జగ్గవరపు కోటిరెడ్డి కుటుంబ సభ్యులను తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. గురువారం యర్రంపల్లి చేరుకున్న ఆయన కోటిరెడ్డి భార్య వెంకాయమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పినపాక ఎమ్మెల్యే గాయం వెంకటేశ్వర్రావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ఉన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ఇంగ్లీష్ మీడియంతో సమాంతరంగా కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలని, తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిన తరువాతే రేషనలైజేషన్ ఉత్తర్వులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.


పోలవరం రూరల్: చేగొండిపల్లిలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు


పోలవరం రూరల్: రేపల్లెవాడు జంక్షన్ చేగొండిపల్లి గ్రామాల మధ్య కాజ్‌వేపై ప్రవహిస్తున్న కొండవాగుల ఉధృతి


పోలవరం రూరల్: దొండపూడి, సాగిపాడు మధ్య ప్రధాన రోడ్డుమార్గంలో ప్రవహిస్తున్న ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నీరు

పొంగిన కొండవాగులు

- ప్రధాన రోడ్డు మార్గాల్లో సైతం వాగుల ఉధృతి
- కొట్టుకుపోతున్న రహదారులు
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఏజెన్సీ ప్రాంతంలోని కొండవాగులు పొంగి పొర్లుతున్నాయి. పోలవరం మండలంలో 115.4 మి.మి వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేని వర్షాలతో గ్రామాల్లో ఇళ్ల చుట్టూ వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్లు కూడా నీట మునిగాయి. కాజ్‌వేలు ప్రధాన రోడ్డు మార్గాల్లో సైతం కొండకాలువల నీరు ప్రవహించడంతో గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. పోలవరం నుంచి ఎల్ఎన్ఎన్ డీపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో దొండపూడి సాగిపాడు మధ్య గల కాజ్‌వేపై నాలుగు అడుగుల నీరు ప్రవహించడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం వచ్చే హైదరాబాద్ బస్సు కూడా కాలువ అవతలి నిలిచిపోయింది. రేపల్లెవాడ జంక్షన్ నుంచి చేగొండిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో కాజ్‌వేలపై భారీగా కొండవాగుల నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలవరం నుంచి ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా పలుచోట్ల వర్షం నీటితో పాటు కొండవాగుల నీరు కూడా తోడుకావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేడ్రాల, నక్కలగొయ్యి, కొవ్వాడ, ఇసుక కాలువలు పొంగి ప్రవహించాయి. కొవ్వాడ కాలువ నీరు పట్టిసీమ ఔట్ ఫాల్ స్లూయిజ్‌నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది. అలాగే కొండ కాలువల నీరు కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి చేరుతోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

కొయ్యలగూడెం: భారీ వర్షాలకు మండలంలోని కాలువలు గురువారం ఉధృతంగా ప్రవహించాయి. నరసన్నపాలెం సమీపంలోని బైనేరు, రాజవరం దగ్గరలోని ఎర్రకాలువ, కొయ్యలగూడెం సమీపంలోని పులి వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. కన్నాపురం తూర్పు, పడమటి కాలువలు ఉధృతికి బుట్టాయిగూడెం వైపు పోలవరం వైపు రాకపోకలు స్తంభించాయి. కొద్దిపాటి వర్షాలకే రెండు కాలువలు తరచూ ఉప్పొంగుతూ వస్తుండడంతో ప్రమాదాలతో పాటు రహదారి ప్రయాణాలు ఆగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వైపులా హైలెవెల్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కొయ్యలగూడెం: కన్నాపురంలో తూర్పు, పడమటి కాలువలు ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

బుట్టాయగూడెం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బుట్టాయగూడెం మండలం గురుగుమిల్లి, రెడ్డిబొడ్డేరు, చింతకొండ, గొట్టాలరేవు, పూచికగొంది గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనితో ఆ రహదారులపై కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ఒకరికొకరు సహాయం చేస్తూ వాహనాలను అటూ ఇటూ దాటిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆ రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని గొట్టాలరేవు గ్రామానికి చెందిన కెచ్చెల పోతురెడ్డి కోరారు.


బుట్టాయగూడెం: గొట్టాలరేవు, చింతకొండ వెళ్లే రహదారి కొట్టుకుపోవడంతో వాహనదారుల అవస్థలు

ఈ-పంట నమోదు తప్పనిసరి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం, లక్ష్మడుగూడెం, సీతప్పగూడెం గ్రామాల్లో మొక్కజొన్న, వరి, తదితర పంటల ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. పంటల బీమా కూడా పొందవచ్చనన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల ద్వారా వరి, మొక్కజొన్న వంటి పంటలను ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని చెప్పారు. రైతు సేవా కేంద్రం సహాయకులు కె.వంశీ, గ్రామ రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీరామ్‌మూర్తి పాల్గొన్నారు.

పోల్నాటి బాబ్జికి అభినందనలు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీటీసీ ఛాంబర్ అధ్యక్షుడిగా పోల్నాటి శ్రీనివాసరావు(బాబ్జి) ఎన్నిక కావడంపట్ల జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండల జెడ్పీటీసీగా, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న పోల్నాటి బాబ్జి, ఏలూరులో జరిగిన ఛాంబర్ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈమేరకు పోల్నాటి బాబ్జికి వారు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ మీడియా కోఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న, నాయకులు దోరేపల్లి విజయ్‌కుమార్, వీరంకి మాధవ్, మల్లవరపు పోసు తదితరులు ఉన్నారు.

బీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల బహుజన టీచర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బి.మనోజ్ కుమార్ పేర్కొన్నారు. పూలపల్లి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా వుస్సే కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా అందుగుల నాగేశ్వరరావు, కోశాధికారిగా గొల్లపల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా మరపట్ల సోమరాజు, మహిళా కార్యదర్శిగా కాటం లలిత కుమారిలను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ 117 జీవోను ఇంతవరకు రద్దు చేయకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.రామారావు, జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ధర్మలింగం పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లోనూ అధికార పార్టీ ఒత్తిళ్లు

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో గురువారం జరిగిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక అధికార పార్టీ ప్రాబల్యానికి గురై, ఫలితాలు తారుమారయ్యాయని వైఎస్సార్ సీపీ నేత, మాజీ గ్రామ సర్పంచ్ యాచమనేని నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 24 మంది ప్రతినిధులను, వారంతా కలసి చైర్మన్‌ను, ఉప చైర్మన్ లను ఎన్నుకునే ప్రక్రియను ఉదయం నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. అయితే 7వ తరగతి ప్రతినిధులను ఎన్నుకునే సమయంలో అధికార పార్టీ ప్రాబల్యం కనిపించింది. తొలుత చేతులు పైకి ఎత్తమని నిర్వహించిన ఎన్నికలో స్పష్టత లేకపోవడంతో, రెండోసారి డివిజన్ (వేరువేరుగా కూర్చునే) పద్ధతిలో ఎన్నికను నిర్వహించారు. అందులో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందారు. అయితే ఎంఈఓ ఆదేశాలంటూ మొదట జరిగిన ఎన్నికను ఖరారు చేసి, టీడీపీ బలపరచిన అభ్యర్థులు గెలిచినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.లలిత కుమారి ప్రకటించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగానే ఫలితాలను తారుమారు చేశారంటూ నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రెండోసారి ఎన్నిక జరిగినప్పుడు, మొదటి ఎన్నిక దానంతట అదే రద్దవుతుందని అన్నారు. ఫలితాలు వెల్లడించడానికి ఎంఈఓ అనుమతి తీసుకున్న రిటర్నింగ్ అధికారి, రెండోసారి ఎన్నిక జరిపే ముందు ఎందుకు అనుమతి తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ చట్ట సభలోనే డివిజన్ విధానం అమలులో ఉన్నప్పుడు ఇక్కడెందుకు ఉండదని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాస్వామ్యబద్ధంగా వేసిన ఓటుకు ఇక్కడ విలువ లేకుండా పోయిందని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోని పలు కోర్టు తీర్పులను రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి, ఎన్నిక జరిగిన ప్రక్రియ సరికాదని చెప్పినా వారు వినలేదని ఆయన అన్నారు. ఉన్నతాధికారులకు దీనిపై ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.


ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో ఎన్నికలు జరిగిన పాఠశాల వద్ద రోడ్డుపై పోలీసులు, ఇరుపార్టీల నాయకులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో జె.సురేష్‌బాబు తెలిపారు. ఎన్నికల నిర్వహణ తీరును డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీను పర్యవేక్షించారని చెప్పారు.

కొయ్యలగూడెం: నూతనంగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీలు విద్యార్థులు, విద్యాలయాల అభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ కె.చెల్లన్న దొర, ఎంపీడీఓ బి.అశోక్ కుమార్, ఎంఈఓ జె.సురేష్‌బాబు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీలు గురువారం ఎన్నిక అయిన సందర్భంగా కొయ్యలగూడెంలోని పలు పాఠశాలలను ఎంపీడీవో బి.అశోక్ కుమార్, ఎస్సై వి.చంద్రశేఖర్ పరిశీలించారు.

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. మండలంలో మొత్తం 54 పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికలు సజావుగా జరిగాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఎన్నికలు నిర్వహించారు. ఒక్క వేలేరుపాడు హైస్కూల్‌లో మాత్రం పార్టీలు పోటీపడ్డాయి. రాజకీయాలకతీతంగా జరగాల్సిన ఈ ఎన్నికలో టీడీపీ, జనసేన పార్టీలు పోటీపడ్డాయి.

టీడీపీలో బయటపడ్డ వర్గపోరు

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనవారిగూడెం ఎస్సీ కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల వేళ.. టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు తమ అభ్యర్థులు పెండెల విజయ్, యంత్రపాటి కృష్ణలను భరిలోకి దింపారు. వారిద్దరూ టీడీపీ అభ్యర్థులు కావడంతో ఆ పార్టీ నేతలు సైతం రెండుగా చీలి ప్రచారాన్ని నిర్వహించారు. ఉదయం ఎన్నిక జరిగిన పాఠశాల వద్ద ఇరువురి నాయకులు ఓటుకు రూ. 2 వేలు చొప్పున, మొత్తం 28 ఓట్లుకు డబ్బులు పంపిణీ చేశారు. అయితే హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికలో పెండెల విజయ్‌కు 12 ఓట్లు, కృష్ణకు 3 ఓట్లు వచ్చాయి. దాంతో విజయ్ గెలుపొందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

బిడ్డలకు తల్లిపాలే శ్రేష్ఠం


అంకంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న తల్లులు

చింతలపూడి: బిడ్డలకు తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పి మాధవి అన్నారు. ప్రగడవరం పంచాయతీ అంకంపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బిడ్డలకు పాలు ఇచ్చే తల్లులు అందరూ ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో సూచించారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రిపాలు పట్టించడం వలన శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రగడవరం సెక్టార్ సూపర్‌వైజర్ కె కమలాబాయమ్మ, ఉపాధ్యాయిని నిర్మలా కుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కుక్కునూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కోరారు. గురువారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ అత్యవసర సమావేశం డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు అధ్యక్షతన జరిగింది. సంజీవరావు మాట్లాడుతూ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ వేడుకలలో జెండావిష్కరణ అనంతరం ఆదివాసీ నాయకుల ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ వేడుకలకు ఆదివాసీ గ్రామాల ప్రజలు, యువత, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పైదా పరమేశ్వరావు, జెడ్డి రఘు, మాధవరం సర్పంచ్ సత్యనారాయణ, కంటిపెల్లి రాజు, పైదా చిన్నబాబు, గొర్రె కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించి, గాంధీజీ దేశానికి చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్ మాట్లాడుతూ గాంధీజీ నిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమం వలన బ్రిటిష్ వారి కబంధహస్తాల నుంచి భారతీయులందరూ విముక్తి పొంది స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని పొందామన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఎం.ఉషారాణి, సిబ్బంది చంద్రమోహన్, రత్న సిరిలో, కుమార్ రాజా పాల్గొన్నారు.

చెరువుల్ని తలపిస్తున్న రోడ్లు


కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు

కుక్కునూరు: మండలంలోని రహదారులు చెరువుల్ని తలపిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కుక్కునూరు ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిలో ఉన్న గొయ్యి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టే వరకైనా గుంతలలో మట్టిపోయించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఏజెన్సీలో వదలని వానలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు వదలకుండా కురుస్తూనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం కాస్త ఎండ కనిపించినప్పటికీ మళ్లీ వర్షం దంచికొట్టింది. కొండప్రాంతంలో ఎడతెరిపిన కురుస్తున్న వర్షాలకు కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. కేఆర్‌పురం సమీపంలో ఉన్న తూర్పు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరువాగు కొద్దిసేపు ఉధృతంగా ప్రవహించి తగ్గింది. దీనితో వాహనాల రాకపోకలు యధాతథంగా కొనసాగాయి. వర్షాలకు పంట పొలాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కోడే కాల్వ జలాశయాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు జల్లేరు వాగు కల్వర్టు కొట్టుకుపోయి నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆ కల్వర్టులోకి చెత్తాచెదారం కూరుకుపోయింది. దీనితో వరదనీరు ప్రవహిస్తున్న సమయంలో తూర్లకు అడ్డంగా చెత్త ఉండడంతో కల్వర్టుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి తూర్లలో చిక్కుకున్న చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


రెడ్డిగణపవరం జల్లేరువాగు తూముల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం


కర్రెడ్లగూడెం సమీపంలో వరదనీటిలో మొక్కజొన్న పంట


కేఆర్‌పురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తూర్పువాగు